

శ్రీరాముడి శోభాయాత్రకు తరలిరావాలి

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 11: శ్రీరామ నవమిని పురష్కరించుకొని ఈ నెల 17న సాయంత్రం నిర్వహించే శోభాయాత్రకు భక్తులు తరలిరావాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఉత్సవంలో ప్రజలు పాల్గొనాలని కోరారు. వీహెచ్‌పీ నేత బి.రమేష్ మాట్లాడుతూ.. శోభాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. హిందూ వాహిని నాయకుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు బాబయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, బాల్రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


ఆమనగల్లులో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



చేవెళ్ల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు







భక్తి శ్రద్ధలతో రంజాన్

- జిల్లా వ్యాప్తంగా సంబురాలు
- ఆలింగనాలతో శుభాకాంక్షలు
- ప్రత్యేక వంటకాల ఆరగింపు

8

జిల్లాలో రంజాన్ పండుగను ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త దుస్తులు ధరించి మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక నమాజ్ నిర్వహించి మత పెద్దలు ఖురాన్ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ముస్లింలను ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లింలు బంధువులకు, స్నేహితులకు పండుగ స్పెషల్ షీర్‌కుర్మా పంపిణీ చేశారు. సాయంత్రం హోటళ్లు, హలీం సెంటర్ల వద్ద సందడి నెలకొంది. పండుగ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిది. శాసన కర్తలను, నేతలను ఎన్నుకునేందుకు వయోజనులందరికీ రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశం ఓటు. అర్హత ఉన్నా ఓటు హక్కు లేని వారికి, 18ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. సార్వత్రిక/సాధారణ ఎన్నికల్లో ఓటు వేసేందుకు చాలా మంది ఆసక్తి చూపడం లేదు. పల్లెలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం మరింత తక్కువ నమోదవుతోంది. నగర శివారుల్లో 2018 లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ 50శాతానికి మించలేదు. ఓటరు జాబితాలో ఉన్న వారిలో సగం మంది ఓటే వేయడం లేదన్న మాట! ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఓటు హక్కును పొందడంతో పాటు ఎన్నికల్లో దానికి వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం, ప్రభుత్వాలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. 'స్వీప్'తో ఓటు హక్కుపై ప్రజలకు వివరిస్తున్నారు. వినూత్న కార్యక్రమాలతో ఓటు హక్కు ప్రాముఖ్యతపై తెలియజేస్తున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేలా అధికారులు, యంత్రాంగ కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఓటు హక్కు పొందేందుకు వీరంతా అర్హులే!

18ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా తమ పేరు నమోదు చేసుకునేందుకు అర్హులే. 2006 మార్చి 31లోగా పుట్టిన వారంతా ఓటరు జాబితాలో పేరు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుకు వయసు ధ్రువపత్రంతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో జతపరిచి సంబంధిత బీఎల్‌ఓకు అందచేయాలి. అలాగే ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు, అన్ని అర్హతున్నా ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు కూడా ఫారం-6 ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. ఓటరు నమోదుకు వెబ్ సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అన్నీ ఓకే అయిన తరువాత కొన్ని రోజుల్లో ఇళ్ల వద్దకే ఓటరు గుర్తింపు కార్డును పంపిస్తారు. సంబంధిత ఏరియా బూత్ లెవెల్ అధికారులు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తారు. ఒక వేళ గుర్తింపు కార్డు రాకున్నా ఆన్‌లైన్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. అయితే ప్రజలు దరఖాస్తు చేసుకునే సమయంలో అప్లికేషన్ రిజెక్ట్ కాకుండా నిర్ణీత ప్రూఫ్‌లు తప్పక జతచేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా వయసు నిర్ధారణ సర్టిఫికెట్ కోసం టెన్త్ మెమో లేదా ఇతర అందుబాటులో ఉన్న సర్టిఫికెట్ జిరాక్స్ కాపీని జత చేయాలి. అలాగే ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను, ఫామ్‌లో అడిగిన ఇతర వివరాలను సమర్పిస్తే ఫామ్ రిజెక్ట్ కాకుండా ఓటరుగా నమోదవుతారు.

VOTE REGISTRATION



లాస్ట్ చాన్స్

25న అనుబంధ జాబితా

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను గత ఫిబ్రవరి 8న ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో మరోసారి జాబితా సవరణ చేపట్టారు. దీని ప్రకారం ఈ నెల 15వ తేదీ వరకు ఓటరు నమోదు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హతున్న వారి పేర్లను అనుబంధ జాబితాలో చేరుస్తారు. లోక్‌సభ ఎన్నికల ఓటర్ల అనుబంధ జాబితా ఈ నెల 25న ప్రకటించనున్నారు. ఈ ఎన్నికలకు ఇదే తుది జాబితా అవుతుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలన్నా, అభ్యర్థులుగా పోటీ చేయాలన్నా ఓటరు లిస్టులో పేరుంటేనే సాధ్యం. ఇందుకు ఓటు హక్కు అర్హతుండి లిస్టులో పేరులేని వారందరూ దరఖాస్తు చేసుకోవాలి. అలాగే రాజకీయ పార్టీల నాయకులు, చదువుకున్న వారు ఓటరు లిస్టులో పేరు నమోదు, సవరణలపై తెలియని వారికి తెలియజెప్పాలి. ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని, పేరు లేకుంటే దరఖాస్తు కోసం ప్రోత్సహించాలి.

ఓటరు నమోదుకు ఈ నెల 15తో ముగియనున్న గడువు

- ఓటు హక్కు నమోదు, వినియోగంపై విస్తృత ప్రచారం
- ఓటింగ్ శాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమాలు
- పట్టణాలు, నగరాలు, యువతే టార్గెట్
- కాలనీలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం విధించిన గడువు సమీపిస్తోంది. 18ఏళ్లు నిండిన వారితో పాటు అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల ఓటర్‌గా పేరు నమోదు చేసుకోని వారు ఇక ఆలస్యం చేయకుండా తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. ఈ నెల 15వ తేదీలోగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటేనే ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసే అవకాశం లభిస్తుంది. ఈ మే 13వ తేదీన లోక్‌సభ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. అర్హతున్న వారంతా ఓటరుగా పేరు నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం చేస్తోంది. అయితే పట్టణాలు, నగర ప్రాంతాల్లో చదువుకున్నవారు అధికంగానే ఉన్నప్పటికీ ఓటరుగా పేరు నమోదు, ఓటు హక్కు వినియోగం విషయంలో ప్రజలు ఆసక్తిచూపడం లేదు. గ్రామీణులతో పోలిస్తే పట్టణాలు, నగరాల్లో ఓటింగ్ ప్రకియల్లో పాల్గొంటున్న వారి సంఖ్య తక్కువే ఉంటోంది. ఇది ప్రతీ ఎన్నికల్లోనూ నిరూపితం అవుతోంది. ఓటు విలువ తెలియక తమ పాలకులను ఎన్నుకునే అవకాశాన్ని కోల్పోతున్నారు. ముఖ్యంగా నగర, నగర శివారు ప్రాంతాల్లో లక్షలాది మంది ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. అలాగే కొందరు తమకు అర్హత ఉన్నా ఓటరుగా పేరు కూడా నమోదు చేసుకోవడం లేదు. హైదరాబాద్, శివారు ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకువెళ్తున్నా ఎన్నికల్లో ఓటు వేసే విషయంలో మాత్రం వెనుకబడే ఉంటున్నాయి. ఎన్నికల రోజును చాలా మంది ఓ సెలవు దినంగా చూస్తున్నారు తప్పితే ఓటు వేసేందుకు ప్రభుత్వం, వివిధ ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థలు కల్పిస్తున్న అవకాశంగా మాత్రం చూడడం లేదు. నగర శివారు ప్రాంతాల్లో లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ 50శాతానికి మించడం లేదు. అంటే ఉన్న ఓటర్లలో సగం మంది ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో, ప్రజాప్రతినిధుల ఎన్నికలో ప్రతీ ఓటు ఎంతో విలువైంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో కొన్ని శివారు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 40శాతానికి లోపే ఓటింగ్ నమోదు కావడం ఈ సందర్భంగా గమనార్హం. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు రెండు నెలల ముందు నుంచే అధికారులు కార్యాచరణ మొదలు పెట్టారు. ఓటు హక్కుపై ప్రజలను చైతన్యపరిచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే బూత్‌స్థాయి అధికారుల(బీఎల్‌ఓ)తో పాటు తహసీలార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటరు జాబితాను అందుబాటులో ఉంచారు. ప్రజలు ఈ జాబితాలను పరిశీలించి లిస్టులో తమ పేరు ఉందో లేదో చూసుకోవాలి. జాబితాలో పేరు లేకుంటే ఫారం-6 ద్వారా పేరు నమోదుకు తహసీల్దార్ కార్యాలయం/బూత్ లెవల్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. మున్సిపాలిటీల్లో మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలి. అలాగే ఎన్నికల సంఘం ఓటరు సర్వీస్ పోర్టల్‌తో పాటు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు చివరి గడువు మాత్రం ఏప్రిల్ 15 అని మాత్రం అందరూ గుర్తించాలి.

యువతే లక్ష్యంగా వివిధ అవగాహన కార్యక్రమాలు

లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. 18ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు. దేశంలోని ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలనే సంకల్పంతో కేంద్ర ఎన్నికల సంఘం స్వీప్(సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ ఎన్నిల దృష్ట్యా ఉమ్మడి జిల్లాలో స్వీప్ కార్యక్రమాలను అధికారులు ప్రారంభించారు. ప్రతి జిల్లాలో స్వీప్ కార్యక్రమ నిర్వాహణ కోసం ఒక నోడల్ అధికారిని నియమించారు. ముఖ్యంగా ఓటింగ్ శాతం తక్కువ నమోదయ్యే పట్టణ, నగర ప్రాంతాల్లో వినూత్నరీతిలో ఓటర్ల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువతను చైతన్యపరిచేందుకు కాలేజీల్లో కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థులకు ఓటు నమోదుతో పాటు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి కాలేజీలో క్యాంపస్ అంబాసిడర్‌లను నియమించారు. వీరు మిగతా విద్యార్థులు ఓటర్‌గా నమోదుకావడానికి తోడ్పడుతున్నారు. ఓటు హక్కు వినియోగంపై తల్లితండ్రులను చైతన్యపరిచే పిల్లలతో కూడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేను ఓటేస్తా, 5కే రన్, 2కే రన్, ప్రతిజ్ఞలు వంటి కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజెన్స్, ట్రాన్స్‌జెండర్లు, యువత, దివ్యాంగులు, వాకర్స్ అసోసియేషన్, సైకిలిస్ట్ అసోసియేషన్లు, పోలీసులు, విద్యార్థినీవిద్యార్థులను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు చేస్తున్నారు. రెండు రోజుల కిందట నగరంలోని కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్‌లో జరిగిన 2కే రన్ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ తదితరులు పాల్గొన్నారు. ఐ ఓట్ ఫర్ ష్యూర్(నేను తప్పకుండా ఓటు వేస్తాను) వంటి నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించారు.

రేపు చేవెళ్లలో కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



చేవెళ్లలో సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఏప్రిల్ 11 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా చేవెళ్లలో నిర్వహించే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. గురువారం చేవెళ్లలో గల ఫరా ఇంజినీరింగ్ కాలేజీ ఆవరుణలో నాయకులతో కలిసి సభ ఏర్పాట్లు యాదయ్య పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన చేవెళ్లలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగకు ప్రజలు తరలి రావాలని కోరారు. చేవెళ్ల లోక్‌సభ స్థానంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు, ప్రజలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మాజీ సీఎం కేసీఆర్ రానున్నారని చెప్పారు. సభ ఏర్పాట్లను పరిశీలించిన వారిలో చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, ప్యాక్స్ ఛైర్మన్ రాంరెడ్డి, శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కె.అనంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మహేందర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ శశాంక, తదితరులు

మహిళా విద్యకు మార్గదర్శకులు జ్యోతిబా పూలే

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11 : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు మార్గదర్శకులు మహాత్మా జ్యోతిబా పూలే అని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. జ్యోతిబా పూలే 198వ జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జ్యోతిబా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన బహుజన తత్వవేత్త సామాజిక దార్శనికుడు జ్యోతిబా పూలే అని, ఆయన దేశానికి ఎన్నో సేవలు అందించారని, వర్ణ వివక్షను రూపుమాపేందుకు, దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతికి జ్యోతిబా ఆచరించిన కార్యాచరణ మహోన్నతమైందన్నారు. విద్య, సమానత్వంతోనే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే జ్యోతిబా అప్పట్లోనే ఆచరించి చూపారన్నారు. ఆయన విధానాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన సతీమణి సావిత్రిబాయికి కూడా ఉన్నత విద్యావంతురాలిగా తీర్చిదిద్ది, ఎంతో మంది మహిళలకు సావిత్రిబాయిచే విద్య నేర్పించారని, చరిత్రలో సావిత్రిబాయి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని తెలిపారు. బాలికలకు, మహిళలకు చదువుకునేందుకు ప్రత్యేకంగా పాఠశాలలను నెలకొల్పారన్నారు. జ్యోతిబా పూలే ఆశయాలను పూర్తిచేసే క్రమంలో ప్రతి ఒక్కరు పునరంకితం కావాలన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు జ్యోతిబా చేపట్టిన సంస్కరణలు నేటికీ అనుసరనీయం అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, బీసీ సంక్షేమ అధికారి విమల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు

- కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు : మాజీ మంత్రి సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 11 : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేయాలని కార్యకర్తలు, నాయకులను మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి కోరారు. తాను పార్టీ మారుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అయితే బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గురువారం కొత్తూరు గేటు వద్ద గల ఓ ఫాంహౌస్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, పేద మహిళలకు నెలకు రూ.2,500, ఇందిరమ్మ ఇళ్ల హామీలను ఎప్పటినుంచి అమలుచేస్తారని నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో విద్యుత్, తాగునీరు సరఫరాలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కందుకూరుకు మంజూరైన మెడికల్ కళాశాలను ఇక్కడి నుంచి తరలిస్తే చూస్తే ఊరుకోబోం అని హెచ్చరించారు.

ఎక్కడి చెత్త అక్కడే!

- మొగిలిగిద్దలో వారం రోజులుగా పారిశుధ్య సమస్య
- పంచాయతీ వద్దే నిలిచిన చెత్త సేకరణ ట్రాక్టర్
- ఇబ్బందుల్లో గ్రామస్తులు.. పట్టించుకోని అధికారులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 11 : ఫరూఖ్‌నగర్ మండలంలో అతిపెద్ద గ్రామమైన మొగిలిగిద్దలో పారిశుధ్య సమస్య నెలకొంది. చెత్తను తరలించే ట్రాక్టర్ వారం రోజులుగా పంచాయతీ కార్యాలయం వద్దే నిలిచిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే నిల్వ అయిందని తెలిపారు. సర్పంచ్‌ల పాలన ముగిసి, స్పెషలాఫీసర్ల పర్యవేక్షణ వచ్చినప్పటి నుంచి గ్రామంలో పారిశుధ్య, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో ఎనిమిది మంది పారిశుధ్య సిబ్బంది, ట్రాక్టర్ డ్రైవర్ ఉన్నాడన్నారు. తాగునీటి సరఫరా కోసం వాటర్ మ్యాన్, విద్యుత్ నిర్వహణకు మరో వ్యక్తి ఉన్నాడని తెలిపారు. ఇన్నాళ్లు సర్పంచ్ ఉండడంతో సమస్యలు ఉండేవి కాదని, ఇప్పుడు పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది పట్టించుకోకే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నాడని, వారం రోజుల నుంచి పంచాయతీ ఆఫీసు వద్ద ట్రాక్టర్‌ను నిలిపివేశాడన్నారు. పారిశుధ్య పనులను, తాగునీటి సరఫరాను, స్ట్రీట్‌లైట్ల నిర్వహణను చూడాల్సిన పంచాయతీ కార్యదర్శి గానీ, స్పెషలాఫీసర్‌గానీ పట్టించుకోకే సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ ఈ సమస్యలు వస్తున్నా పట్టింపే లేదన్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు. కాగా ఈ సమస్యలపై పంచాయతీ కార్యదర్శి సయ్యద్ బాసిత్ స్పందిస్తూ.. పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరాపై తాను రోజూ పర్యవేక్షిస్తున్నానని, ట్రాక్టర్ డ్రైవర్ మద్యం తాగుతున్నాడనే అతడికి ఈ మధ్య ట్రాక్టర్ ఇవ్వడం లేదన్నారు. తాను డ్రైవర్‌తో మాట్లాడి జమైన చెత్త తరలించేందుకు పంపానని, ఇకపై చెత్త సేకరణ ట్రాక్టర్ నిలిచిపోకుండా చూస్తానన్నారు.



కొన్ని రోజులుగా పంచాయతీ ఆఫీసు వద్ద నిలిచిన ట్రాక్టర్

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 11: రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న పాలకులపై పోరాటానికి సిద్ధం కావాలని రైతు సంఘం వికారాబాద్ జిల్లా కార్యదర్శి గంటి సురేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతీ పంటకు మద్దతు ధర కల్పించే దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు పండించిన వరి పంట పూర్తిగా నష్టానికి దారి తీసిందన్నారు. రైతు సమస్యలపై రాబోయే రోజుల్లో పోరాటాలకు రైతులందరూ సంసిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాబ్యానాయక్, భీమేశ్, లక్ష్మీనారాయణ, గణేశ్ రాథోడ్, అనిల్, సంతోష్, రాజు, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ఈటల సమక్షంలో బీజేపీలో చేరిక



కీసర: ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన గ్రామస్తులు

కీసర, ఏప్రిల్ 11: ఆయా రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈసందర్భంగా ఈటల రాజేందర్ గురువారం కీసర ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో కీసర గ్రామానికి చెందిన పలువురికి బీజేపీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేశం మల్లేష్ గౌడ్, సింగిరెడ్డి వెంకటరెడ్డి, ఐలయ్య, చినంగని సుధాకర్, నల్లా వెంకటరెడ్డి, బండారి శ్రీనివాస్ యాదవ్, చిక్కుడు సత్యనారాయణ, చంద్రమౌళి పాల్గొన్నారు.



యాలాల: బీజేపీలో చేరిన వివిధ పార్టీల కార్యకర్తలు

యాలాల: మండలంలోని దేవనూర్‌లో గురువారం పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లు ఆకుల శివకుమార్, బూదప్ప వివిధ పార్టీల నుంచి 30 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు జి.అరుణ్ కుమార్, కె.కాశీనాథ్, మధుగౌడ్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం

శామీర్‌పేట, ఏప్రిల్ 11: మండలంలోని తూంకుంటలోని మొగుళ్ళ వెంకటరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల వైఎస్ గౌడ్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. శామీర్‌పేట, మూడుచింతలపల్లి, తూంకుంట మున్సిపల్‌లకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, నాయకులు విచ్చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

నా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయ్

- ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తా
- కాంగ్రెస్ తాండూరు మండల విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీ రంజిత్‌రెడ్డి
- ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎంపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

తాండూరు రూరల్, ఏప్రిల్ 11: చేవెళ్ల ప్రజల కోసం అహర్నిషలు కృషి చేస్తానని, వారి సమస్యలు వినేందుకు తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. వీరశైవ ఫంక్షన్ హాల్‌లో తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ గురువారం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎంపీగా చేవెళ్ల ప్రజలకు చేసిన సేవలు గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి మళ్లీ తనకు అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. తనను కలిసేందుకు ఖర్చులు భరించి హైదరాబాద్ రావొద్దని, కేవలం ఫోన్ చేస్తేనే స్పందిస్తానన్నారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కుటుంబంలో ఉన్నానని, కుటుంబసభ్యులకు ఏమైనా ఆపదవస్తే స్పందించి సేవచేస్తానని అన్నారు. గతంలో ఎంపీగా పనిచేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలకు అపాయింట్ మెంట్ ఉంటేనే కలిసేవారని గుర్తు చేశారు. అపాయింట్ మెంట్ అడిగేవారికి ప్రజలు రిటైర్మెంట్ ప్రకటిస్తారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రతీ సంవత్సరం దేశవ్యాప్తంగా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడంలేదని ప్రధాని మోదీని యువకులు అడగాలని సూచించారు. ప్రతి ఒక్కరికి రూ.15లక్షలు ఖాతాలో వేస్తామని ఎందుకు వేయలేదన్నారు. రామ మందిరం పేరుతో బీజేపీ ప్రభుత్వం యువకులను తప్పుదోవ పట్టిస్తోందన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తకు గుర్తింపు ఇస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కొత్త, పాత నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచి వచ్చిన వ్యక్తిని అని, ప్రతీ కార్యకర్తను జాగ్రత్తగా కాపాడుకుంటానని అన్నారు. అనంతరం నారాయణపూర్, అంతారంతండా, కొత్లాపూర్, మల్కాపూర్, కోటబాస్పల్లి, కోణాపూర్, చెనిగేష్‌పూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు వడ్డె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో 200మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధారాసింగ్, వడ్డె శ్రీనివాస్, ఉత్తంచంద్, జనార్దన్‌రెడ్డి, రవిగౌడ్, రాజ్‌కుమార్, మురళీగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రఘునాథ్‌రెడ్డి, రాజుగౌడ్, పండరి, రవిసింధే పాల్గొన్నారు.



ఎమ్మెల్యే, ఎంపీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు

ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వండి: రంజిత్‌రెడ్డి

హైదర్‌నగర్, ఏప్రిల్ 11 : నియోజకవర్గ ప్రజలకు సేవచేసుకునే అవకాశం కల్పించాలని చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. గురువారం హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకాందనగర్, కూకట్‌పల్లి డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమావేశంలో టూరిజం డెలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వమని, ఇచ్చిన హామీలన్నింటిని నేరవేరుస్తుందని చెప్పారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రంజిత్‌రెడ్డి గెలుపును చాలెంజ్‌గా తీసుకోవాలి: తీగల

సరూర్‌నగర్ : కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపును పార్టీ నాయకులు, కార్యకర్తలు ఛాలెంజ్‌గా తీసుకుని పట్టుదలతో పని చేయాల్సిన అవసరం ఉన్నదని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మీర్‌పేట్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలో తీగల మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే పేదలకు సరైన న్యాయం జరుగుతున్నదన్నారు. బీఆర్ఎస్ పాలనలో చోటుచేసుకున్న కుంభకోణాలను ప్రజలకు వివరించి, ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసేలా కృషి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బంగారు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు జిల్లెల నరేందర్‌రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, సిద్దాల దశరథ, బాలప్ప, బొబ్బిలి కిరణ్‌గౌడ్, రవినాయక్, రవీంద్రాచారి, కోట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తీగల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జహంగీర్

బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం

- సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్

మంచాల, ఏప్రిల్ 11 : బీజేపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటం కొనసాగిస్తామని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్ అన్నారు. మంచాలలోని కా.కృష్ణమూర్తి స్మారక భవన్‌లో గురువారం నిర్వహించిన సీపీఎం మండల విస్తృస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుసంఘాల ప్రతిఘటనతో కేంద్ర ప్రభుత్వం రైతుచట్టాలను వెనక్కి తీసుకుందని గుర్తుచేశారు. ప్రజాసమస్యలను గాలికొదిలేసి మత విద్వేశాలు సృష్టిస్తున్న బీజేపీకి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, పగడాల యాదయ్య, వెంకట్‌రాములు, శ్రీరాంనాయక్, మండల కార్యదర్శి శ్యాంసుందర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, రాజు, స్వామి, మమత, ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి, జగదీష్, హఫీజ్ పాల్గొన్నారు.

సీపీఎంలో చేరిక

మంచాల మండల పరిధి తిప్పాయిగూడకు చెందిన వివిధ పార్టీల నేతలు గురువారం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాన్‌వెస్లీ సమక్షంలో సీపీఎంలో చేరారు. చేరిన వారిలో బీజేపీకి చెందిన చెక్క కుమార్ తదితరులున్నారు.



జంటుపల్లి అటవీసెక్షన్‌లో పరిశీలిస్తున్న అరుణ

అడవులను నరికిన వారిపై కఠిన చర్యలు

- డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్

ధారూరు, ఏప్రిల్ 11: అడవులను నరికిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. సొంత అవసరాల కోసం అడవులను నరకడం నేరమన్నారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ధారూరు రేంజ్‌లోని జుంటుపల్లి, సంగాయపల్లి, రాస్నం అటవీ ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా రాత్రిపూట ప్రవేశించి అడవిలోని చెట్లను నరికివేస్తున్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంతో పాటు ఇతర సెక్షన్లలోనను చెట్లను నరికివేసినట్లు సమాచారం ఉన్నదన్నారు. అడవుల నరికివేతపై ధారూరు ఇన్‌చార్జి రేంజర్ అరుణతో విచారణ చేయిస్తున్నామని తెలిపారు. అడవులను నరికిన వారిని గుర్తించి చర్యలు చేపడుతామని చెప్పారు. పోడుపట్టాలు పొంది ఆడవి నరికితే వారికి ఇచ్చిన పోడు పట్టాలు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కల్పించిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెడుతామని హెచ్చరించారు. అటవీ సంపద ప్రజల ఆస్తిగా భావించి అటవీ సంరక్షణలో తమకు తోడ్పటునందించాలని కోరారు. అటవీ సంపదను నాశనం చేస్తే మానవాళి మనుగడకు నష్టం కలిగించిన వారమవుతామని ఆయన అన్నారు.

వేసవి శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మే 1 నుంచి 31 వరకు 14సంవత్సరాలలోపు వయసు కలిగిన బాలబాలిలకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా క్రీడలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి బలరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాల నిర్వహణకు ఆసక్తి కలిగిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నేషన్ క్రీడాకారులు, సీనియర్ క్రీడాకారులు తాము నిర్వహించాలనుకుంటున్న క్రీడలు, గ్రామం, మొబైల్ నంబర్ తదితర వివరాలతో కూడిన దరఖాస్తులను జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో ఈ నెల 18 వరకు అందజేయాలని ఆయన కోరారు. క్రీడలు నిర్వహించే వారికి గౌరవ వేతనంతో పాటు క్రీడా సామగ్రి అందజేస్తామన్నారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని దేవరయాంజాల్ ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ భవనంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్, మొబైల్ సర్వీసింగ్, డొమెస్టిక్ ఎలక్ట్రీషియన్, సోలార్ టెక్నీషియన్, సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్, రిపేరింగ్, మొదలైన వాటిలో వృత్తి శిక్షణ ఇస్తామని జిల్లా యువజన, క్రీడల అధికారి బలరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు వృత్తి నైపుణ్య శిక్షణాకేంద్రం లేదా 7989405049, 9290217274 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.



ఎక్మాయి రైతు వేదిక వద్ద మద్యం సీసాలు

మందుబాబులకు అడ్డాగా రైతు వేదిక భవనం

బషీరాబాద్, ఏప్రిల్ 11: మండలంలోని ఎక్మాయి రైతు వేదిక భవనం మందు బాబులకు అడ్డాగా మారింది. ఈరైతు వేదిక భవనం ఊరి చివర నిర్మించడంతో సాయంత్రమైతే చాలు ఇక్కడి ఆవరణ, పరిసర ప్రాంతమంతా మద్యం సీసాల చప్పుళ్ల మోగుతున్నాయి. ఈ భవనం చుట్టూ ఎక్కడబడితే అక్కడ మద్యంబాబులు తిష్టవేస్తున్నారు. మద్యం సీసాలు, తినుబండారాలు పడేయడంతో అపరిశుభ్రంగా మారుతోంది. రోజూ అర్ధరాత్రి వరకు మందుబాబులు ఇక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే భవనం కిటికీ అద్దాలను ధ్వంసం చేశారని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై ఏఈవో నవీన్‌ను వివరణ కోరగా రైతువేదికలో కిటికీ అద్దాలు ధ్వంసమైన విషయం వాస్తవమేనని ఈ విషయమై పోలీసులకూ ఫిర్యాదు చేశామని చెప్పారు. మరోసారి తమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామన్నారు.



ఎక్మాయి రైతు వేదిక భవనంలో ధ్వంసమైన కిటికీ అద్దాలు

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం!

- కాంగ్రెస్‌లో చేరిన మెజారిటీ కౌన్సిలర్లు
- రసవత్తరంగా మేడ్చల్ మున్సిపాలిటీ రాజకీయం





చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 11: ఏడాది కాలంగా అవిశ్వాస గుప్పిట్లో కాలంవేళ్లదీస్తున్న మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డికి పదవీ గండం మొదలైంది. అధికారం ఉన్న నాడే సొంత బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఆమెపై అవిశ్వాసానికి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. కాగా మున్సిపల్ వైస్‌చైర్మన్‌తో సహా 11మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరటంతో ఇక అవిశ్వాసం పక్కా అంటూ మేడ్చల్‌లో ప్రచారం ఊపందుకుంది. మున్సిపాలిటీ పాలకవర్గంలో మొత్తం 23మంది కౌన్సిలర్లు ఉండగా వారిలో ఒకరు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్, 19మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఉండేవారు. కాగా వీరిలో ప్రస్తుతం 11మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరటంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ల సంఖ్య 14కు చేరింది. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు మాత్రమే మిగిలారు. దీంతో అవిశ్వాసం పెట్టాలన్న టార్గెట్‌తో కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతున్నట్లు ప్రచారం కొనసాగుతోంది. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న ఎనిమిది మంది కౌన్సిలర్లలో మరో ముగ్గురు కౌన్సిలర్లు అవిశ్వాసానికి ముందే కాంగ్రెస్ కండువా కప్పుకునే వీలుందన్న ప్రచారం సాగుతోంది. పార్లమెంట్ ఎన్నికల కన్న ముందు మేడ్చల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ఉనికిలేకుండా చేయాలన్న ప్రయత్నంలో భాగంగా కాంగ్రెస్ పెద్దలు రెండునెలలుగా చేస్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నట్లు పరిస్థితులు కనబడుతున్నాయి.

ఫలించని బీఆర్ఎస్ ప్రయత్నం

చైర్‌పర్సన్ మర్రి దీపిక భర్త మర్రి నర్సింహారెడ్డి సొంత పార్టీ కౌన్సిలర్లను నచ్చజెబుతూ వచ్చారు. చివరికి అసెంబ్లీ ఎన్నికల అనంతరం కౌన్సిలర్లను దుబాయ్ టూర్ తీసుకెళ్లారు. అనంతరం మరికొందరు కౌన్సిలర్లను గోవా టూర్ తీసుకెళ్లి ఎంజాయి చేయించి తీసుకొచ్చారు. అయినప్పటికీ నేతలు అదను చూసి పార్టీ ఫిరాయించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి నమ్మిన బంటుగా చైర్‌పర్సన్ భర్త నర్సింహారెడ్డికి ముద్ర పడటంతో చైర్‌పర్సన్‌ను వదిలేసి మిగితా కౌన్సిలర్లను పార్టీలో చేర్చుకోవాలని కాంగ్రెస్ నేతలు రెండు నెలలుగా ప్రయత్నించారు. కాగా పార్టీలో చేరితే చైర్‌పర్సన్‌తో సహా చేరుతామని కొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పెద్దల ముందు ప్రతిపాదన పెట్టగా ఆ ప్రతిపాదనను కాంగ్రెస్ స్థానిక నేతలు తోసిపుచ్చడంతో చివరికి చైర్‌పర్సన్‌ను వదిలేసి తమ రాజకీయ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవటానికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పెద్దల నిర్ణయానికి తలొగ్గి కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం సాగుతోంది.

చైర్‌పర్సన్ వెంట కొందరు కౌన్సిలర్లు

పార్టీని వీడిన కౌన్సిలర్లలో కొందరు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టబోమంటూ తమ సన్నిహితులతో చెబుతున్నారు. మరికొందరు మాత్రం అవిశ్వాసం ఎప్పుడు పెడితే అప్పుడు రెడీ అంటున్నట్లు సమాచారం. కాగా పార్టీని మారబోమని చైర్‌పర్సన్ భర్తతో దుబాయ్, గోవావెళ్లి ఎంజాయ్ చేసి వచ్చిన నేతలు ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలను శిరసా వహించక తప్పదంటూ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అవిశ్వాసమే టార్గెట్‌గా పెట్టుకుని పెద్దఎత్తున బీఆర్ఎస్ కౌన్సిలర్లను తమ పార్టీలో చేర్చుకున్నారన్న వాదనలే బలంగా వినబడుతున్నాయి. చైర్‌పర్సన్‌పై ముందు నుంచి వ్యతిరేకతతో ఉన్న కౌన్సిలర్లు రేపు అవిశ్వాసం పెట్టినా సిద్ధంగా ఉన్నామంటూ సంకేతాలు పంపుతున్నారు.



సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు(ఫైల్)



జ్యోతిబాపూలే విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

విద్యార్థుల అస్వస్థతపై విచారణ

- జ్యోతిబాపూలే, కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడిన ఆర్డీవో
- కేజీబీవీ ఎదుట జిప్సం కర్మాగారం ఉండటంపై ఎందుకు ఫిర్యాదు చేయలేదని ఎస్‌వోపై ఆగ్రహం.. జ్యోతిరావుపూలే హాస్టల్ సెక్యూరిటీపై అసంతృప్తి



కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

తాండూరు రూరల్, ఏప్రిల్ 11 : జ్యోతిబాపూలే, కేజీబీవీలో విద్యార్థుల అస్వస్థతపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించారు. వెంటనే విచారణ జరపాలని తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావును ఆదేశించారు. గురువారం తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న కేజీబీవీని ఆర్డీవో సందర్శించారు. హాస్టల్‌లోని వంట గది, నీటి సరఫరా గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ వెనుకభాగంలో అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ ఎదుట ఉన్న జిప్సం ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసన వల్ల బాలికలు అస్వస్థతకు గురవుతున్నా.. లిఖిత పూర్వకంగా ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని ప్రత్యేకాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు తామే ఫిర్యాదు చేస్తామన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అలేఖ్య కుటుంబ సభ్యులతో ఆర్డీవో ఫోన్‌లో మాట్లాడారు. ఈనెల 28 నుంచి అలేఖ్య అనారోగ్యంతో బాధపడుతోందని, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు ప్రత్యేకాధికారి ఆర్డీవోకు వివరించారు. ప్రస్తుతం అలేఖ్య గాంధీలో చికిత్స పొందుతోంది. అనంతరం చెనిగేష్‌పూర్ రోడ్డు మార్గంలోని జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌ను ఆర్డీవో సందర్శించారు. విద్యార్థినులు మౌనిక, సుమిత్ర ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రిన్సిపాల్ నాన్సీతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. పాఠశాలలో మొత్తం 508 మంది విద్యార్థులకు గాను.. 436 మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉన్నారని తెలిపారు. ఆర్డీవో వారందరితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం, సౌకర్యాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. పాఠశాలను సందర్శించి ప్రహరీ చిన్నగా ఉండి, సెక్యూరిటీ సమస్య ఉండటంతో ప్రిన్సిపాల్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో హాస్టల్‌ను తనిఖీ చేస్తానని విలేకరులకు తెలిపారు. వారం రోజుల్లో హాస్టల్‌ను సందర్శించాలని ఆర్ఐ బాల్‌రాజ్‌ను ఆదేశించారు. పూర్తి నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఆయనతో డీటీ విజయేందర్ ఉన్నారు.

చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరేస్తాం

- బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో ప్రజా ఆశీర్వాదయాత్ర

చేవెళ్ల, ఏప్రిల్ 11 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లలో బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా గురువారం చేవెళ్ల మండలంలోని పామెన, కందవాడ, పలుగుట్ట గ్రామాల్లో పర్యటించారు. అలాగే సాయంత్రం చేవెళ్ల మండలంలోని ఎన్కెపల్లి, ఆలూర్, మీర్జగూడ, బస్తేపూర్, చనువల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను చేవెళ్ల ఎంపీగా గెలిపించిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని వారికి భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలయ్యిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి బీజేపీ విజయం ఖాయమని, మూడవ సారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ నిండు మనస్సుతో ఆశీర్వాదించి ఈ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, కృష్ణగౌడ్, దేవుని శర్వలింగం, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, ఎం. వైభవ్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మొయినాబాద్ మండలంలో..

మొయినాబాద్ : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించి బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలను కోరారు. ప్రజాఆశీర్వాద యాత్రలో భాగంగా మొయినాబాద్ మండలంలోని నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దని, బీజేపీని గెలపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్, రత్నం, రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజమల్లేశ్ పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపుతా

శంషాబాద్ రూరల్ : చేవెళ్ల ఎంపీగా ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతానని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించి ఆదుకుంటానని కొండా వి శ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి శంషాబాద్ మండలంలోని పాల్మాకుల, పెద్దతూప్రా, పిల్లోనిగూడ, మదన్‌పల్లి, పెద్దశాపూర్, అలీకోల్‌తండా, కాచారం, రాయన్నగూడ, పాలంకోలే, మదన్‌పల్లిపాత తండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి బీజేపీ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించారు. సందర్భంగా జరిగిన రోడ్‌షోల్లో ఆయన మాట్లాడుతూ బీజేపీని అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థికి సొంత పార్టీలోనే వ్యతరేకత ఉందనే విషయం గుర్తుంచుకోవాలని ప్రజలకు చెప్పారు.మోదీ ప్రభంజనాన్ని అడ్డుకునేందుకు ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు కుట్రలు చేయడం దారుణమన్నారు. 12 స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. త్వరలో కాంగ్రెస్, ఇతర పార్టీల కార్యకర్తలు భారీగా బీజేపీలో చేరబోతున్నారన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

కులకచర్ల: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కుటుంబసభ్యులు కోరారు. మండలంలోని హన్యానాయక్ తండా, బుర్కు తండాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి డాక్టర్ మీరారెడ్డి, పిన్ని కల్పరెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డిలు ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న సూర్యకాంత్



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బీజేపీ బూత్ కమిటీల నియామకం

బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు ముమ్మర ప్రచారం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు సూర్యకాంత్ పిలుపునిచ్చారు. మండలంలోని చెల్లాపూర్ గ్రామంలో గురువారం బూత్ కమిటీ అధ్యక్షులను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, గుడాల వెంకటేశ్, నాయకులు భీమయ్య, అంజి, అంజిలయ్య, సత్తయ్య, ఆంజనేయులు, రామకృష్ణ, రామాంజనేయులు, అంజయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, వెంకట్రాములు పాల్గొన్నారు.

దేశం కోసం, ధర్మం కోసం బీజేపీని గెలిపించండి: సంగీతారెడ్డి

ఎల్‌బీనగర్: దేశం కోసం, ధర్మం కోసం బీజేపీని మరోసారి గెలిపించాలని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి డాక్టర్ సంగీతారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం మైదానంలో వాకర్స్‌ను కలిసి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిపై చర్చించారు.

భక్తి శ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్


ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి


కేశంపేట : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


చేవెళ్ల : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు


కందుకూరు: ఈద్గా లో ప్రార్థనలో ముస్లింలు


కడ్తాల : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా వివిధ పట్టణాలు, మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలను సుందరంగా అలంకరించారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు సందేశమిస్తూ రంజాన్ మాసం శాంతి, ప్రేమ, దయ సౌభ్రాతృత్వాలను పంచుతుందన్నారు. మసీదులు, దర్గాల వద్ద ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.


ఇబ్రహీంపట్నంలో ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి


మహేశ్వరం : ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కొత్తూర్‌లో చిన్నారుల ఆలింగనం


మాడ్గులలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు


కొందుర్గులో ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


శంషాబాద్‌లోముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు


మంచాల : ఆరుట్ల ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


షాబాద్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న అవినాష్‌రెడ్డి


శంషాబాద్ రూరల్ : శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు


యాచారం : ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు


చౌదరిగూడ : ఈద్గా వద్ద ప్రార్థనలో ముస్లింలు

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

● రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కొత్తూర్, ఏప్రిల్ 11 : కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. తిమ్మాపూర్ నుంచి కొత్తూర్ వైపు నడుచుకుంటూ వస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు. మృతుడు 30-35 సంవత్సరాల వయసు ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 90440795743, 8712568270 నెంబర్లకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

వాహనం ఢీకొని యువకుడు..

చేవెళ్ల, ఏప్రిల్ 11 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై మీర్జాగూడ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆలూరి వినయ్ కుమార్(23) అనే యువకుడు చేవెళ్ల మండల కేంద్రంలోని ఓ మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. మధ్యాహ్నం వరకు షాపులో పని చేసి బయటకు వెళ్లాడు. కాగా రాత్రి మీర్జాగూడ గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం వినయ్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టగా అతను అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వృద్ధురాలు..

తలకొండపల్లి, ఏప్రిల్ 11 : బావిలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామానికి మల్తాకర్ నర్సమ్మ(60) బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. గురువారం ఉదయం చీపునుంతల నుంచి సాలార్‌పూర్ వెళ్లే మట్టి దారి పక్కన బావి దగ్గర ఆమె చెప్పులు కనిపించాయి. అనుమానం వచ్చి బావిలోకి చూడగా నర్సమ్మ మృతదేహం కనిపించింది. మృతదేహం నర్సమ్మదిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతురాలి కూతురు అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● 8 తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


పరిశీలిస్తున్న పోలీసులు

ఆదిభట్ల, ఏప్రిల్ 11 : అందరూ నిద్రిస్తున్న వేళ ఇంట్లోకి అర్ధరాత్రి దుండగులు ప్రవేశించి నగలు, నగదు అపహరించుకుపోయిన ఉదంతం ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడలో బుధవారం రాత్రి జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మన్నెగూడ పరిధిలోని ఎస్ఎస్ఆర్ కాలనీలో సామల ప్రభాకర్‌రెడ్డి కొంత కాలంగా కుటుంబ సభ్యులతో నివాసముంటున్నారు. బుధవారం కుటుంబసభ్యులతో కలిసి తన ఇంటిపై అంతస్తులో నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోని క్రింది అంతస్తులోకి చొరబడ్డాడు. గుట్టు చప్పుడు కాకుండా 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు దోచుకెళ్లారు. గురువారం ఉదయం లేచి ఇంట్లోకి వెళ్లడానికి రాగా తలుపులు తీసి ఉండడం చూసి విస్తుపోయాడు. ఘటనపై ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో సంఘటనా ప్రదేశానికి సీఐ రాఘవేందర్‌రెడ్డి వెళ్లి చోరీ ఎలా జరిగిందో వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ఆమనగల్లు, ఏప్రిల్ 11 : లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. అక్రమంగా మద్యం, డబ్బు తరలించకుండా ప్రత్యేక నిఘా ఉంచారు. కడ్తాల మండలం మైసిగండి టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక పోలీసు చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం చెక్‌పోస్ట్ వద్ద ఆమనగల్లు ఎస్సై బాల్‌రాంనాయక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాలను తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. రూ. 50 వేలకు మించి నగదు తరలించినట్లయితే సంబంధిత డబ్బుకు సంబంధించి సరైన ఆధారాలు, ధ్రువ పత్రాలను చూపించాల్సి ఉంటుందన్నారు. చెక్‌పోస్ట్ వద్ద నిరంతరం తనిఖీలు, నిఘా కొనసాగుతుందని తెలిపారు.

నేడు బసవేశ్వర విగ్రహావిష్కరణ

మంచాల, ఏప్రిల్ 11 : మంచాలలో ఏర్పాటుచేసిన శ్రీ మహా బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ నేడు (శుక్రవారం) జరుగుతుందని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొత్తూరి శేఖరప్ప, జక్కాహరీష్ తెలిపారు. విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీరశైవులకు విజ్ఞప్తి చేశారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 : బీఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ విస్తృత సమావేశాన్ని నేడు (శుక్రవారం) నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు. బొంగులూరు గేట్ ప్రమిద కన్వెన్షన్‌లో ఉదయం పది గంటలకు జరిగే ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, భువనగిరి నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, యువ నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిలు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

మంచాల పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

మంచాల, ఏప్రిల్ 11 : మంచాల వ్యవసాయ పరపతి సహకార సంఘ సర్వసభ్య సమావేశం నేడు(శుక్రవారం) జరుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి తెలిపారు. ఆరునెలల కాలంలో సంఘ పరిధిలో జరిగిన ఆర్థిక లావాదేవీల నివేదకను వెల్లడించనున్నట్లు చెప్పారు. అన్నిగ్రామాల రైతులు, పీఏసీఎస్ డైరెక్టర్లు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

సీతారామ కల్యాణానికి విరాళం

మాడ్గుల, ఏప్రిల్ 11 : శ్రీరామ నవమిసందర్భంగా శిరసనగండ్ల గుట్ట మీద జరుగబోయే సీతారామా కల్యాణానికి ఆర్కపల్లి గ్రామానికి చెందిన కృష్ణమాచారి రూ. 14వేల విళాలమందజేశారు. మాడ్గుల మండలంలోని శ్రీరామ దండు సభ్యులు ప్రతి సంవత్సరం బీజేపి ఆధ్వర్యంలో ర్యాలీగా వెళుతారు. అదేవిదంగా ఈనెల 17న శిరుసనగండ్ల గుట్టమీద జరుగబోయే సీతారామా కలాణానికి బీజేపి జిల్లా నాయకుడు దండు శ్రీను గౌడ్ ఆధ్వర్యంలో వెళ్తనున్నారు.

పూలే జీవితం అందరికీ ఆదర్శం


:కడ్తాలలో పూలే జయంతి వేడుకల్లో జడ్పీటీసీ దశరథ్‌నాయక్, తదితరులు

ఆమనగల్లు /కడ్తాల్ / తలకొండపల్లి/షాద్ నగర్‌అర్బన్/చౌదరిగూడ/కొత్తూర్/కొందుర్గు/చేవెళ్ల/కందుకూరు/ షాబాద్, ఏప్రిల్ 11 : సామాజిక అసమానతలను రూపు మాపడానికి జీవితాన్ని తాగ్యం చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శం అని పలువురు వక్తలు కొనియాడారు. మహిళా హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, జరిపిన కృషి చిరస్మరణీయమని వారు అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండల కేంద్రాల్లో గురువారం మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను పలు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే జయంతిని పురష్కరించుకుని షాద్ నగర్‌లోని ఆయన విగ్రహానికి గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకుని జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆయన చిత్రపటాని పూలమాల వేసి నివాళ్లు ఆర్పించారు. పూలే జయంతి సందర్భంగా మంచాల మండల పరిధిలో జాపాలలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కొత్తూరు మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద గల పూలే విగ్రహానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాడ్గుల మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ బ్లాక్‌వాయిస్ ఆధ్వర్యంలో పూలే జయంతీ ఘనంగా నిర్వహించారు. పూలే జయంతి వేడుకలను కొందుర్గు మండల కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల మండల కేంద్రంలో పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. భారత్ జోడో అభియాన్, సీపీఎం ఆధ్వర్యంలో కందుకూరు మండల కేంద్రంలో విడి విడిగా జయంతి వేడుకలు జరిపారు. షాబాద్ మండలంలోని షాబాద్, నాగర్‌గూడ తదితర గ్రామాల్లో పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్, సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.


కొత్తూర్‌లో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అంజయ్య


షాబాద్‌లో మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

'ధార్మిక పరిషత్' రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వెంకట్‌రాంరెడ్డి


నియామకపత్రం అందుకుంటున్న వెంకట్‌రాంరెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 11 : బీజేపీ చేవెళ్ల మండల నాయకుడు కె. వెంకట్‌రాంరెడ్డి ఆ పార్టీ ధార్మిక పరిషత్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నియమితులైయ్యారు. ఈ మేరకు గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాశ్, కో- కన్వీనర్ నిరంజన్ దేశాయ్ చేతుల మీదుగా ఆయన నియమాక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ధార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. తన ఎంపికకు సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు చెప్పారు. పార్టీ బాధ్యతలతో పాటు ధార్మిక పరిషత్ సిద్ధాంతం, ఆదర్శాలకు అంకితమై నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో పని చేస్తానన్నారు. అన్ని వర్గాలతో కలిసి ముందుకు సాగుతామన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం


మాట్లాడుతున్న చిత్తరంజన్ దాస్

ఆమనగల్లు , ఏప్రిల్ 11 : కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్ దాస్ అన్నారు. దేశంలో మార్పు కోసం, ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రూపొందించిన మ్యానిఫెస్టో దేశ వ్యాప్తంగా ప్రజల్లో మనోధైర్యం పెంపొందించిందన్నారు. దేశంలో రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభంజనం మొదలైందని ఆయన పేర్కొన్నారు. ఇండియా కూటమి సంపూర్ణ మెజార్టీ సాధించి కేంద్రంలో అదికారం చేపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని, అవినీతి కుంభకోణాలతో ఆ పార్టీ ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, మాజీ ఎంపీపీ దావ ధనుంజయ్య, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎం.ఏ ఖలీల్, నాయకులు శ్రీనునాయక్, అలీం, ఫరీద్, తదితరులు ఉన్నారు.

నిస్వార్థంగా పనిచేసే సత్తా బీఆర్ఎస్‌కే ఉంది

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 11 : ప్రజలకు నిస్వార్థంతో పనిచేసే సత్తా కేవలం బీఆర్ఎస్ పార్టీకే ఉందని, కార్యకర్తలు అధైర్యపడి పార్టీ మారాల్సిన పని చేదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సార్లరావులపల్లి గ్రామానికి చెందిన 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ప్రవీణ్‌నాయక్, గౌతమినాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రజలకు రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను నేరుగా అందజేయడానికి మాజీ సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు చెందిన ఉపేందర్‌నాయక్, దేవేందర్‌నాయక్. రాజ్‌కుమార్‌నాయక్, నరేష్, వెంకటేష్, రఘు, రాజేష్ తదితరులకు పార్టీ కండువా కల్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ గోవర్ధన్‌నాయక్, నాయకులు బాలునాయక్, శ్రీరామ్, జంగయ్య, మోహన్, శ్రీనివాస్, రాజేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన వారితో సబితారెడ్డి

బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడిగా కార్తీక్

కందుకూరు : స్థానిక పట్టణ కేంద్రానికి చెందిన తాళ్ల కార్తీక్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా నియమించినట్లు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్‌తో కలిసి మండల కేంద్రంలో కార్తీక్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మండల మహిళ అధ్యక్షుడు తాండ్ర ఇందిరదేవేందర్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనర్సింహరెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ షాద్‌నగర్ పట్టణ కార్యవర్గం ఎన్నిక


బీజేపీ నాయకులతో పట్టణ నూతన కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 11: బీజేపీ షాద్‌నగర్ పట్టణ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ స్థానిక కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కె. హరిభూషన్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా జంబుల నర్సింహులు, పసులోటి శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మంగ విజయ్, రంగన్నగౌడ్, భాగం మధు, మల్లాలం రాము, కె. రాజు ముదిరాజ్, లిగల్ సెల్ కన్వీనర్లుగా శ్యాంసుందర్, కాసోజు శివచారి, ఓబీసీ మోర్చ అధ్యక్షుడిగా మెడిగా శ్రీనివాస్, ఎస్సీ మోర్చ అధ్యక్షుడిగా గంగపురం సురేష్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

నిరంతరం ప్రజల బాగు కోసమే పని చేస్తా


మంచిరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

యాచారం/ మంచాల ఏప్రిల్ 11 : అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల బాగోగుల కోసమే పని చేస్తానని, ఈ ప్రాంత ప్రగతి కోసం నిరంతరం శ్రమిస్తానని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ యాచారం మండల అధ్యక్ష కార్యదర్శులు కె.రమేష్‌గౌడ్, పి.బాషా, మాజీ సర్పంచులు వి.రాజునాయక్, ఎదటి సత్యపాల్, నాయకులు ఓ .యాదయ్యగౌడ్‌లు ఎలిమినేడులోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. మంచాల మండలానికి చెందిన బీఆర్ఎస్ నేతలు మంచిరెడ్డి నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, ఏర్పులచంద్రయ్య, చిందం రఘుపతి, బహదూర్, బద్రీనాథ్‌గుప్త, పాల్గొన్నారు.

ఘనంగా బాలీశ్వరి మాత ఆరాధనోత్సవం


ఆరాధనోత్సవంలో దయానంద స్వామి..

తలకొండపల్లి , ఏప్రిల్ 11 : మండల పరిధిలోని మాదాయిపల్లి గ్రామంలో శ్రీ సద్గురు యోగి బాలీశ్వరి మాత 62వ ఆరాధనోత్సవ కార్యక్రమాన్ని గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి కందూరు శంకరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి దయానంద స్వామి, భక్త సురేశ్ స్వామి, విశ్వామిత్ర తపోభూమి స్వామి, భూమానంద స్వామి, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆశ్రమంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు దైవ, ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని స్వామీజీలు పిలుపునిచ్చారు. భక్తి భావంతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవితాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లికి చెందిన శివారెడ్డి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, అంజయ్యగౌడ్, లక్ష్మయ్య , ప్రహ్లాద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతయ్య, శ్రీశైలంయాదవ్, యుగంధర్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

తలకొండపల్లి : మండల పరిధిలోని చీపునుంతల గ్రామానికి చెందిన నర్సమ్మ మృతిచెందగా ఆమె కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. అంత్యక్రియలకు రూ. 3 వేలు సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు కృష్ణయ్య, శ్యామ్‌లాల్, రామకిష్టయ్య, జంగయ్య, శ్రీశైలం, పెంటయ్య. తదితరులు ఉన్నారు.

తలకొండపల్లి : మండల పరిధిలోని మాదాయిపల్లి గ్రామానికి చెందిన ఆయిల్ రాఘవేందర్‌గౌడ్ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఉదారం చూపారు. కష్టాల్లో ఉన్న రాఘవేందర్ కుటుంబానికి గురువారం రూ.65 వేలు అందజేశారు. యూనియన్ నాయకులు సుదర్శన్, ఆంజనేయులు, రమేశ్, ఉన్నారు.

కడ్తాల్ : మండల పరిధిలోని చరికొండ గ్రామంలో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటుకు కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ , డీసీసీబి డెరెక్టర్ గంప వెంకటేష్ చేయూత నందించారు. గంప చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా వెంకటేష్ రూ. 5 వేలు, జర్పుల రాధకృష్ణ చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా దశరథ్‌నాయక్ రూ.10 వేలు సమకూర్చారు. గురువారం చరికొండ గ్రామంలో నిర్వాహకులకు నగదుసు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మాగౌడ్, నరేష్, గోపాల్, సబేర్, జంగయ్య, యాదయ్య, రాములు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలోనే అనినీతి, నిరుద్యోగం


సమావేశంలో మాట్లాడుతున్న రాములు

పరిగి, ఏప్రిల్ 11: పదేళ్ల బీజేపీ పాలనలోనే అవినీతి, నిరుద్యోగం పెరిగిపోయిందని భారత్ జోడో అభియాన్ నాయకులు ఆర్.రాములు, బి.నర్సింహులు, బి.మల్లేశ్‌లు అన్నారు. భారత్‌జోడో అభియాన్ ఆధ్వర్యంలో గురువారం రాజ్యాంగం ప్రజాసంఘాల పాత్ర అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వెంకట్‌రాంలు, టి.వెంకటయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.